క్లుప్తంగా

ఓవర్‌లోడ్ సమస్యను పరిష్కరించండి


ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వస్తున్న మంటలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరులో విద్యుత్ ఓవర్ లోడ్ సమస్య ప్రజలను వేధిస్తోంది. స్థానిక బీసీ కాలనీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తరచూ మంటలు వస్తున్నాయని, దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

రాళ్ల చెరువు ఆక్రమణ


చెరువు గర్భంలో వేసి ఫెన్సింగ్

భోగాపురం: మండలంలోని ముంజేరు రెవెన్యూ పరిధిలో ఉన్న రాళ్లచెరువు ఆక్రమణకు గురవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి శుక్రవారం తీసుకెళ్లారు. సుమారు ఎకరా చెరువు గర్భాన్ని కొంత మంది ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని అధికారులకు తెలిపారు. అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

చంద్రమ్మ సేవలు మరువలేనివి


చంద్రమ్మను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: నగర పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య విభాగంలో పబ్లిక్‌హెల్త్ వర్కర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన జలమడుగుల చంద్రమ్మ సేవలు మరువలేనివని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ కె. అప్పలరాజు అన్నారు. ఈ మేరకు పదవీ విరమణ చేసిన ఆమెను శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

నెల్లిమర్ల: రైస్‌కార్డుల్లో ఉన్న కుటుంబ సభ్యులందరూ స్థానిక రేషన్ డిపోల్లో తప్పక ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ పి. సుదర్శనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇంకా 7,109 మంది ఈకేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు.

మిమ్స్‌లో సీఎంఈ - 2025 సదస్సు రేపు

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ వైద్య కళాశాలలో మార్చి 2న ఈఎస్‌ఐ ఆస్పత్రి సహకారంతో న్యూరో ఎనస్థీషియా సీఎంఈ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల, ఆస్పత్రి ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం సిటీ బ్రాంచ్, మిమ్స్ ఎనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమం పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు, ఎనస్థీషియా వైద్యులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


బొండపల్లి జనార్దన్ (ఫైల్)

విజయనగరం క్రైమ్: బహుళ అంతస్తు భవనం పైనుంచి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నగరంలో శుక్రవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలియజేసిన వివరాల మేరకు.. నగరంలోని తోటపాలెం ముచ్చువాని చెరువుగట్టుకు చెందిన యువకుడు బొండపల్లి జనార్దన్ (21) తన ఇంటికి సమీపంలో ఉన్న బహుళ అంతస్తు భవనం పైనుంచి దూకేశాడు. వెంటనే స్థానికులు, చుట్టుపక్కలున్న వారు స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడ్ని హుటాహుటిన జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే యువకుడు మృతి చెందాడని వైద్యులు స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే ప్రేమ వ్యవహారం వల్లే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందని ఎస్సై రామ్‌గణేష్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	180

సైన్స్‌తోనే అభివృద్ధి..



విజయనగరం అర్బన్: పరిశోధనల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కేంద్రియ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

సైన్స్‌తోనే అభివృద్ధి సాధ్యపడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భౌతికశాస్త్ర పితామహుడు సర్ సీవీ రామన్ 'రామన్ ఎఫెక్ట్' కనుగొన్న సందర్భంగా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు పలువురు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పలు ప్రాజెక్ట్‌లు తయారు చేసి ప్రదర్శించగా.. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. పలుచోట్ల ముఖ్య అతిథులను సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్


విజయనగరం అర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భువనేశ్వరి ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భమిడిపాటి చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖ


విజయనగరం అర్బన్: సత్య డిగ్రీ కళాశాలలో వైజ్ఞానిక పోటీల విజేతలతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, తదితరులు


పూసపాటిరేగ: ఆకట్టుకున్న చంద్రయాన్ నమూనా


నెల్లిమర్ల: డైట్ కళాశాలలో వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న ప్రిన్సిపాల్ పగడాలమ్మ


పూసపాటిరేగ: ప్రైవేట్ పాఠశాలలో ఇస్రో నమూనాను తిలకిస్తున్న ఎంఈఓ రాజ్‌కుమార్


భోగాపురం: కొంగవానిపాలెం పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 బాలిపల్లి చంద్రమౌళి

మహిళలకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించే పలు కోర్సులకు సంబంధించి ఉచిత శిక్షణా తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ వసతిగృహంలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ జీబీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, మగ్గం వర్క్స్ అండ్ పెయింటింగ్ కోర్సులపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. తెలుపురంగు రేషన్ కార్డు కలిగి 45 ఏళ్ల లోపున్న మహిళలు మాత్రమే ఈ నెల 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 99595 21662, 99857 87820 నంబర్లను సంప్రదించాలన్నారు.

ముద్దాయికి జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: ఏడాది కిందట అప్పటి దిశా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసుకు సంబంధించి విజయనగరం బూర్లిపేటకు చెందిన ముద్దాయి నారంశెట్టి ఈశ్వరరావు (55)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, మూడు వేల రూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించి ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి. బూర్లిపేటకు చెందిన రిక్షా డ్రైవర్ నారంశెట్టి ఈశ్వరరావు (55) ప్రతిరోజూ పిల్లలను తన రిక్షాలో స్కూల్‌కు తీసుకువెళ్తుండేవాడు. ఇదే క్రమంలో గతేడాది నవంబర్ 19న నగరానికి చెందిన ఓ చిన్నారి (7) పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లి దిశా పోలీస్‌స్టేషన్‌లో (మహిళా పీఎస్) ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై బి. రేవతి కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వేగవంతంగా దర్యాప్తు చేపట్టిన అప్పటి ఎస్సై బి. రేవతితో పాటు ప్రస్తుత మహిళా పీఎస్ సీఐ ఈ.నర్సింహమూర్తిలను ఎస్పీ అభినందించారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగర ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 32వ డివిజన్‌లో ఆయన వివిధ విభాగాల అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సిబ్బందికి తగు ఆదేశాలు ఇచ్చారు. గుంతల పూడ్చివేత పనుల్లో నాణ్యత లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నగర వ్యాప్తంగా గోడలపై రాతలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేయకూడదని పలువురిని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను గుర్తించి పన్నులు విధించాలని ప్రణాళికా సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం గల వైద్యులు అవసరం

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల


వర్క్‌షాపులో పాల్గొన్న ప్రొఫెసర్లు, అసోసియేసిట్ ప్రొఫెసర్లు

విజయనగరం ఫోర్ట్: నైపుణ్యం కలిగిన వైద్యులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె. పద్మలీల అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో 30 మంది వైద్యులకు బోధనా నైపుణ్యాలపై శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కొవిడ్ లాంటి కొత్త కొత్త వ్యాధులను ఏవిధంగా ఎదుర్కోవాలనే దానిపై వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పీఏ రమణి, వైస్ ప్రిన్సిపాల్ దేవీమాధవి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ అజయ్‌కుమార్, డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ మణికుమార్, డాక్టర్ శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు


రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పీఎస్ సీతారామరాజు

డెంకాడ: రక్తదాన శిబిరాల ద్వారా మీరందించే రక్తం ఎంతోమంది ప్రాణాలు కాపాడుతుందని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పీఎస్ సీతారామరాజు అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్, క్యాంపస్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ యూత్, ఎన్‌వీఎన్ బ్లడ్‌బ్యాంక్, న్యూలైఫ్ బ్లడ్ సెంటర్ సౌజన్యంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 92 మంది రక్తదానం చేయగా.. వారందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, ప్లేస్‌మెంట్ డీన్ ఎం.సునీల్‌ప్రకాష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.షణ్ముఖరావు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో మందులు

- డాక్టర్ ప్రవీణ్ కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

నెల్లిమర్ల: మండలంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో సుమారు 150 రకాల ఖరీదైన మందులు అందుబాటులో ఉన్నాయని స్థానిక ఆస్పత్రి వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆదిత్య పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఈఎస్ఐ 74వ వార్షికోత్సవం నిర్వహించారు. నెల్లిమర్ల, విజయనగరం ఈఎస్ఐ కార్యాలయాల బ్రాంచ్ మేనేజర్ ఎంపి బేగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... ఈఎస్ఐ కార్డుదారులు హాస్పటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పి. సాయిసంతోష్, లావణ్య, జి .మేరీలావణ్య, ఈ.పూడిబాబు, కె. శంకరరావు, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సూరిబాబు, హెచ్ఎం వి. అమృత, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించండి

- ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ప్రదీప్


మేనేజర్ రాంబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఆరోగ్య మిత్ర సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్, తదితరులు

విజయనగరం ఫోర్ట్: ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) పథకాన్ని ఇన్సూరెన్స్ విభాగంలోకి మార్పు చేసినా పథకంలో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ ఆరోగ్య మిత్ర (వైద్యమిత్ర) కాంట్రాక్ట్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జె. ప్రదీప్ కోరారు. ఈ మేరకు ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ రాంబాబును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేసే ఫీల్డ్ సిబ్బంది అందరికీ పదోన్నతులు కల్పించాలన్నారు. మరణించిన సిబ్బంది కుటుంబ సభ్యులకు రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. అలాగే పదవీ విరమణ చేసిన సిబ్బందికి రూ. పది లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గడువులోగా హామీ ఇవ్వకపోతే సమ్మె తప్పదని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. బంగారునాయుడు, భాను, ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పోరాటానికి మద్దతు

- రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు


రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు, సంఘాల ప్రతినిధులు

విజయనగరం గంటస్తంభం: మున్సిపల్ కార్మికులు చేయనున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని వామపక్ష నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక డీఎస్ఆర్ అమర్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. గత సమ్మె కాలంలో ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని.. ఆప్కాస్‌ను రద్దు ఆలోచన విరమించుకోవాలని కోరారు. అలాగే కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. సమస్యల సాధనకు ఈ నెల 17వ నుంచి దశల వారీగా ఆందోళనలు చేపడుతున్నామని, ఈ క్రమంలో మార్చి3న కలెక్టరేట్ వద్ద ధర్నా, ఆరో తేదీన చలో విజయవాడ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఆశపు వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కరీం, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి డేగల అప్పలరాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు, ఏపీ క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పొడుగు రామకృష్ణ, అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు బూర వాసు, ఉపాధ్యక్షుడు వెలగాడ రాజేష్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగడుగుల కామేష్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు తుపాకుల శ్రీను, కార్యదర్శి కళ్యాణం శ్రీను, దలాయ శ్రీను, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నిర్ణీతకాలంలో సర్వే పూర్తి చేయాలి

- జేసీ ఎస్.సేతుమాధవన్


మోదవలసలో రీ సర్వేపై అధికారులతో మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

డెంకాడ: నిర్ణీత కాలంలోగా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మోదవలస పంచాయతీలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే గ్రౌండ్ ట్రూథింగ్‌పై ఆరా తీశారు. రైతుల సమక్షంలో రీ సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, సర్వే, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఓబీ పనులు వేగవంతం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: మానాపురం ఆర్‌ఓబీ పనులు వేగవంతం చేసి ఏప్రిల్‌లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో నేషనల్ హైవే ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లతో ఆర్‌ఓబీ పనులపై సమీక్షించారు. ఇంతవరకు 81 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన పనులు మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. 2023 జనవరి నాటికి పూర్తి చేయాల్సిన పనులు ఇంతవరకు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ఏప్రిల్ ఒకటో తేదీన ఆర్‌ఓబీని ప్రారంభించాలని స్పష్టం చేశారు.

అందుబాటులో డంపర్ బిన్లు



జిల్లా కేంద్రంలోని వీధులను మరింత శుభ్రపరిచేందుకు 48 డంపర్ బిన్లు అందుబాటులోకి వచ్చాయి. శుక్రవారం నగరానికి చేరుకున్న డంపర్ బిన్లను ప్రజారోగ్య సిబ్బంది భద్రపరిచారు. త్వరలోనే వాటిని వినియోగంలోకి తీసుకురానున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. మరో 15 రోజుల్లో మరొక 50 డంపర్‌బిన్లు కూడా నగరానికి రానున్నాయని తెలిపారు.

– విజయనగరం

పేదలకు వస్త్రాల పంపిణీ..



జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చెరుకూరి నాగరాజు పుట్టినరోజు సందర్భంగా సంఘ ప్రతినిధులు జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ మేరకు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద పేదలకు తువ్వాళ్లు, దుప్పట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తవ్వా మోహనరావు, యువజన సంఘ అధ్యక్షుడు ఆరిశెట్టి సందీప్, సంఘ ఉపాధ్యక్షుడు మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, సహాయ కార్యదర్శి సముద్రాల నాగరాజు, విజ్జపు వెంకట శ్రీనివాసరావు, వళ్లంపాటి ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం

తాగునీటి పరీక్షలు..



నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన క్లోరిన్ పరీక్షలను విరివిగా చేపడుతున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు తోటపాలెంలో పంపిణీ జరుగుతున్న కుళాయి నీటిని శుక్రవారం పరీక్షించారు. క్లోరినేషన్ సరైన స్థాయిలో ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి డివిజన్ పరిధిలో ఐదు చోట్ల క్లోరినేషన్ పరీక్షలు చేపట్టాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా ముషిడిపల్లి, నెల్లిమర్ల రిజర్వాయర్ నుంచి నగర ప్రజలకు అవసరమైన తాగునీరు పంపిణీ చేస్తామన్నారు.

– విజయనగరం

ఉపాధి పనులు వద్దు..



గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో ఉపాధి హామీ పనులు చేపట్టవద్దని భోగాపురం మండలం మెట్ట సబ్బన్నపేటకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..1992లో అప్పటి ప్రభుత్వం ఏడు కుటుంబాలకు కలిపి ఏడెకరాల డీ పట్టా భూమిని కేటాయించిందన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా వ్యవసాయం చేసుకుంటు కుటుంబాలతో జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం రామచంద్రపేట గ్రామానికి చెందిన అసిస్టెంట్ గనగళ్ల గణేష్ వచ్చి ప్రభుత్వం మాకిచ్చిన భూముల్లో ఉపాధి పనులు చేపట్టేందుకు సిద్ధపడుతున్నాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ విచారణ చేపట్టి న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుభాష్ పాల్గొన్నారు.

– భోగాపురం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని దాసన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో శనివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగపూర్ సిటీ, జమ్ము, నారాయణపురం, పడాలపేట, బ్యాంక్ కాలనీ, తాడివాడ, సీఆర్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే పూల్‌బాగ్ స్టేషన్ పరిధిలో బ్యూటిఫికేషన్ వర్క్ చేస్తున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. పూల్‌బాగ్, అజిత్‌సింగ్ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.